నోటీసులతో సరి! కూల్చివేతలు ఎప్పుడు మరి?

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. అధికారులు నోటీసులు జారీ చేస్తున్నా డోంట్ కేర్ అంటూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా అధికారులకు కనుసనల్లోనే జరుగుతోందనేది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లో ఓ వ్యక్తి సుమారు 600 గజాల విస్తీర్ణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈనెల 5వ తేదీన గోదాం ఏర్పాటుకు పనులు ప్రారంభించాడు.

- ఇదే విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారి సంగీతకు స్థానికులు ఫిర్యాదు చేయగా సిబ్బందిని పంపి పనులు నిలుపుదల చేశారు. అంత వరకు బాగానే ఉంది. సిబ్బంది వెళ్లిన తర్వాత సదరు నిర్మాణదారుడు శని, ఆది వారాల్లో చకచక షెడ్డు పనులు పూర్తి చేశాడు. సోమవారం తిరిగి సిబ్బంది అక్కడికి వెళ్లి అవాక్కయ్యారు.
- ఇదే విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారునికి నోటీసు జారీ చేసి పనులు ఆపాలని ఆదేశించారు. సదరు నిర్మాణదారుడు ఏకంగా చుట్టు ప్రహరీ గోదాం పైన రేకులు పనులు పూర్తి చేసి అధికారులకే సవాల్ విసిరాడు.


విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు

'సాక్షి'లో వచ్చిన కథనం

సామగ్రిని సీజ్ చేసి.. నోటీసులు ఇచ్చి..

- ఇదే విషయంపై గురువారం 'విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు.. చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు'అనే కథనం 'సాక్షి'లో ప్రచురితమయ్యింది. దీనిపై స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారిని సంగీత మధ్యాహ్నం సిబ్బందితో అక్కడికి వెళ్లి పనులు చేపడుతున్న సామగ్రిని సీజ్ చేసి సర్కిల్ కార్యాలయానికి తరలించారు.


సామగ్రిని సీజ్ చేసి తరలిస్తున్న సిబ్బంది

- మొదటి నోటీసు జారీ చేశామమిన ఇకపై ఇక్కడ నిర్మాణం చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పి వెళ్లినట్టు తెలిసింది. అయితే అక్రమ ని ర్మాణం కూల్చివేయకపోవడం వెనక మతలబు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణాన్ని కూడా నోటీసులతో సరిపెట్టి మ మ అనిపిస్తారని పలువురు పెదవి విరుస్తున్నారు.

గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు బలాదూర్..

గాజులరామారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను మొదటి దశలోనే కుల్చివేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూడడం మూలంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలతో పాటు అక్కడక్కడ గోదాంలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ నిర్మాణాలపై సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రోత్సహిస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (డీసీపీ) సంతోష్ కుమార్ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నోటీసులు జారీ చేసి కూల్చిన దాఖలాలు లేవు..

- ఇప్పటి వరకు పలు నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినా ఏ ఒక్క నిర్మాణాన్ని కూల్చివేసిన దాఖలాలు లేవు. దీంతో నోటీసులకు 'రేట్'ఫిక్స్ చేసి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఇప్పటి వరకు గాజులరామారం సర్కిల్ పరిధిలో ఎన్ని నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేపట్టారు అన్న విషయంపై ఆరా తీస్తే టౌన్ ప్లానింగ్ అవినీతి బాగోతం వెలుగులోకి వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించినా...

- గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇక్కడి అధికారులు మాత్రం నోటీసులతో కాలయాపన చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే స్థానికులు బాహాటంగానే పేర్కొంటున్నారు.

వైష్ణవి మృతికి స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులే కారణం

బాలిక కుటుంబ సభ్యులు

దుండిగల్: బాలిక మృతి చెందడానికి ఫౌండేషన్ నిర్వాహకులు కారణమని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. అక్కడ కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనగా పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంతింపజేశారు. సూరారం ప్రాంతానికి చెందిన నీలం సతీశ్ కుమార్తె వైష్ణవి (11) దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఆరో తరగతి చదువుతూ అక్కడే ఉంటోంది. కాగా ఈనెల 3వ తేదీన తన బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి 8వ తేదీన తిరిగి ఫౌండేషన్‌కు వచ్చింది. ఉదయం తోటి స్నేహితులతో కలిసి ఆనందంగా ఆటలు సైతం ఆడింది.

- అదే రోజు మధ్యాహ్నం తన గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక మృతికి ఫౌండేషన్ నిర్వాహకులే కారణమని మృతురాలి బంధువులు గురువారం ఫౌండేషన్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలన్నారు. గత సంవత్సరం ఇదే విధంగా మరో బాలిక ఆత్మహత్య చేసుకుందని.. ఇందుకు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.
- విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడి శాంతింపజేశారు. ఇప్పటికే కేసు నమోదు చేశామని సమగ్ర నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. కాగా తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మృతురాలి బంధువులు పేర్కొంటున్నారు.


స్ఫూర్తి ఫౌండేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాలిక కుటుంబ సభ్యులు

రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



ఘనంగా రంజాన్ వేడుకలు

కుత్బుల్లాపూర్ నియోకజవర్గ వ్యాప్తంగా గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్ష నాయకులు ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.
– కుత్బుల్లాపూర్


రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


రంజాన్ వేడుకల్లో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


బాచుపల్లిలో రంజాన్ ప్రార్థనలు


దేవేందర్‌నగర్‌లో బీఆర్ఎస్ నేత ఎస్‌కే అబిద్

పేదల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: పేదల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని.. కరోనా సమయంలో దేశ ప్రజలకు ధైర్యం చెప్పి సకాలంలో వ్యాక్సిన్‌లు అందజేసి మహా ప్రళయానికి ప్రధాని నరేంద్ర మోదీ అడ్డుకట్ట వేశారని మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం రాత్రి షాపూర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఈటల మాట్లాడారు. తాను 22 ఏళ్లుగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడానన్నారు. ఏ నిధులు, నీళ్లు, ఉద్యోగాల కోసం ఆనాడు పోరాటాలు చేశామో.. అవన్ని ప్రత్యేక రాష్ట్రంలో కార్యరూపం దాల్చలేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి ఏమీ చేయలేదని విమర్శించారు.

- కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 2 లక్షల గృహాలను కేసీఆర్ తన ఖాతాలో వేసుకుని వాటికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లుగా నామకరణ చేయడం సిగ్గు చేటన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ. 5లక్షల వైద్య బీమా సదుపాయాన్ని, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.4లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు అందిస్తోందన్నారు.
- టెక్నాలజీ విషయంలో విదేశాలపై ఆధారపడకుండా ఆత్మనిర్భర్ ద్వారా దేశంలోనే అధునాత టెక్నాలజీ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ బాటలు వేశారన్నారు. బంధు ప్రీతి లేని ఆయనను మరోసారి ప్రధానిగా దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.


షాపూర్‌నగర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- వందల ఏళ్లుగా ఎదురు చేసిన రామమందిర నిర్మాణాన్ని సాకారం చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. భవిష్యత్ తరాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ బీజేపీని కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీగా బరిలో దిగిన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈటల కోరారు.

కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు

కాంగ్రెస్‌లో చేరిన నిజాంపేట్ కార్పొరేటర్లు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి రాజకీయ వలసలు జోరందుకున్నాయి. తాజాగా గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ఆవుల పావని, కర్నేటి రాజేశ్వరిలతో పాటు సీనియర్ నాయకులు వెంగయ్యచౌదరి, నాగరాజ్‌యాదవ్, మహేందర్‌రెడ్డి తదితరులు రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఇప్పటికే మేయర్ నీలారెడ్డి తో పాటు పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, మేయర్ నీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీకి మరో షాక్

రాజీనామా చేసిన బుచ్చిరెడ్డి



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లో బీజేపీకి మరో గట్టి షాక్ తగిలింది. ఇప్పటికే నియోజకవర్గంలో బలమైన నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన శిష్యుడు, నియోజకవర్గ కన్వీనర్ బుచ్చిరెడ్డి అదే బాట పట్టారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. దీంతో కుత్బుల్లాపూర్‌లో బీజేపీ పరిస్థితి చుక్కాని లేని నావగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరికొందరు ముఖ్య నాయకులు పార్టీని వీడేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో పలువురు సంక్షేమ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఆయన్ని కలిసి పార్టీలో చేరిన సందర్భంగా అభినందించారు. అదే విధంగా వివిధ బస్తీల్లో నెలకొన్న సమస్యలను శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు.


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే విధంగా పని చేయాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేఎం ప్రతాప్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కేపీ విశాల్ గౌడ్, వివిధ కాలనీల, బస్తీల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కేఎం ప్రతాప్‌ను కలిసిన పట్నం మహేందర్‌రెడ్డి

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

నిజాంపేట్: కారు ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం ధ్వంసమైన ఘటన నిజాంపేట్ కార్పొరేషన్ సాయినగర్‌లో చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్న సమయంలో సాయినగర్ నుంచి వీఎస్ఆర్ కాలేజీకి వెళ్లే రోడ్డులో వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో స్తంభం మధ్యకు విరిగిపోవడంతో ప్రమాదంగా మారింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వెంటనే కరెంట్ సరఫరాను నిలిపి వేసి మరమ్మతులు ప్రారంభించారు.

ఘనంగా జ్యోతిరావ్‌పూలే జయంతి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్‌పూలే జయంతి గురువారం కుత్బుల్లాపూర్ జోన్ వ్యాప్తంగా ఘనంగా జరిగింది. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... మహాత్మా జ్యోతిరావ్‌పూలే చేసిన సేవలు అమోఘమన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనే పూలేకు అసలైన నివాళి అని పేర్కొన్నారు. మహిళలకు విద్య అవసరమని చెప్పి తన భార్యకి మొదటగా చదువు నేర్పించారని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి వారి గుండెల్లో మహాత్మాగా చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. – కుత్బుల్లాపూర్


జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసిన గాజులరామారం ఉపకమిషనర్ మల్లారెడ్డి


సూరారం తెలుగుతల్లినగర్‌లో జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి


సూరారంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపకమిషనర్ నర్సింహ, అధికారులు


జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు గూడ ఐలయ్యగౌడ్ తదితరులు


బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో